www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 12 సెప్టెంబర్ 2024
5
అన్నమయ్య

వరద బాధితులకు రూ.50 వేలు వితరణ

నగదు అందిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : భారీ వర్షాల ధాటికి సంభవించిన వరదల కారణంగా విజయవాడలో సర్వస్వం కోల్పోయిన బాధితులకు పట్టణంలోని విజయభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు అండగా నిలిచారు. తాము దాచుకున్న ప్యాకెట్ మనీ రూ.50వేలు పోగేసి కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే షాజహాన్ బాషా ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి పంపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు ప్యాకెట్ మనీ ఖర్చు చేసుకోకుండా సేవా దృక్పథంతో అందజేయడం స్ఫూర్తి దాయకమన్నారు. విద్యార్థులను, ప్రిన్సిపల్‌ను ఎమ్మెల్యే షాజహాన్ బాషా అభినందించారు. ప్రతి ఒక్కరూ పాఠశాల విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతరం డాక్టర్ ఎన్.సేతు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. వరద బాధితులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

'అన్నదాత సుఖీభవ'కు మోక్షమెప్పుడో!

- 4,16,207 మంది రైతుల సుధీర్ఘ నిరీక్షణ
- ఖరీఫ్ ముగిసినా పట్టని కూటమి సర్కారు
- వైసిపి హయాంలో ఉమ్మడి జిల్లాకు రూ.312.63 కోట్లు విడుదల

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

అన్నదాత సుఖీభవ పథకం అమలుకు మోక్షమెప్పుడో తెలియడం లేదు. రాష్ట్రంలో ఎన్‌డిఎ సర్కారు అధికారంలోకి వచ్చిన అనంతరం రైతు సంక్షేమాన్ని విస్మరించింది. రాష్ట్ర ఎన్నికల చరిత్రలోనే అత్యధిక మెజార్టీతో అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ సర్కారు బాధ్యతా యుతంగా వ్యవహరించాల్సిన స్థానంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలకు అవకాశమిచ్చింది. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రతి రైతుకూ రూ.20 వేల చొప్పున అందిస్తామని హామీనిచ్చింది. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ రైతుభరోసా పథకానికి పేరు మార్చడం మినహా ఎటువంటి పురోగతి లేకపోవడం రైతుల్లో నిరుత్సాహం వ్యక్తమవుతోంది. వైసిపి సర్కారుతో ఎన్‌డిఎ సర్కారు సంక్షేమాన్ని పోల్చి చూసుకుంటున్న నేపథ్యం కనిపిస్తోంది.

కడప జిల్లాలో 2,10,484 మంది రైతులు ఉన్నారు. అన్నమయ్య జిల్లాలో 2,05,723 మంది రైతులు ఉన్నారు. ప్రతి ఏటా వ్యవసాయానికి రైతాంగం సుమారు రూ.400 కోట్ల మేరకు పెట్టు బడులు పెట్టాల్సి వస్తోంది. రైతుభరోసా పేరుతో ప్రభుత్వ సహాయం, బ్యాంక్ రుణాలు, సొంత పెట్టుబడి, వడ్డీ వ్యాపారుల నుంచి సేకరించిన మొత్తాలు ఉంటున్న సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి రైతు భరోసా పేరుతో పెట్టుబడి సహాయాన్ని అందిస్తామనే హామీని అమలు చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్ సీజన్ ముంగిట వైసిపి సర్కారు రైతుభరోసా పథకం పేరుతో రూ.157.86 కోట్లు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 2,02,598 మందికి రూ.151 కోట్లను విడతల వారీగా విడుదల చేసింది. అన్నమయ్య జిల్లాలో 2023-24లో రూ.154.77 కోట్లు విడుదల చేసింది. రైతులకు అరకొరగానే అయినా సకాలంలో పెట్టుబడి అందడంతో ప్రాథమిక వ్యవసాయ పనులకు బాగా అక్కరకొచ్చింది. బ్యాంకర్లు వ్యవసాయానికి అందించిన సహకారంతో వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా తప్పించుకుని పంటల సాగు ఊపందుకుంది. రాష్ట్రంలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డిఏ సర్కారు అధి కారంలోకి రావడంతో రైతుకు భరోసా అందకపోవడం రైతుల్లో నిరు త్సాహాన్ని కలిగించింది. ప్రతిఏటా జూన్ మాసారంభంతో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడం తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్య ంలో రైతాంగానికి పెట్టుబడి ప్రధాన సమస్యగా మారుతోంది. సార్వ త్రిక ఎన్నికల ప్రచారంలో రాష్ట్రంలోని కూటమి నాయకత్వం వైసిపి హామీని అధిగమించి ప్రతి రైతుకూ రూ.20 వేల చొప్పున అంది స్తామని మేనిఫెస్టోలో ప్రకటించింది. ఈ మేరకు పెద్దఎత్తున ప్రచారాన్ని సైతం చేసింది.

ఈ ఏడాది జూన్ నుంచి నేటి వరకు సుమారు నాలుగు నెలలు

గడిచిపోతోంది. ఖరీఫ్ సమయం ముగిస్తున్నప్పటికీ రైతు భరోసా పథకం పేరు స్థానంలో అన్నదాత సుఖీభవ పథకం పేరును ప్రకటించడం మినహా ఎటువంటి కసరత్తు చేయకపోవడం రైతుల్లో తీవ్ర నిరుత్సాహాన్ని కలిగిస్తోంది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వాటాను సైతం విడుదల చేయకపోవడమేమిటనే విమర్శ రైతు సంఘాల నుంచి వినిపిస్తోంది. రాష్ట్రంలోని టిడిపి, బిజెపి, జనసేన పార్టీలు సంయుక్తంగా కూటమి సర్కారు పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే వాటా సహాయాన్ని అయినా విడుదల చేస్తే విమర్శల నుంచి బయట పడే అవకాశం ఉందేమో ఆలోచించాలనే హితోక్తులు వినిపిస్తుండడం గమనార్హం.

రైతులను ఆదుకోండి

సేద్యం భారంగా మారింది. సేద్యం ఖర్చులు అమాంతం పెర గడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం సకాలంలో పెట్టుబడిని అందిస్తే వడ్డీల భారం తప్పుతుంది. వడ్డీలు పెరిగితే రైతులు రుణ ఊబిలో కూరుకునిపోతారని గమనించాలి.

- టి.నారాయణ, రైతు, రాచపల్లి, రామాపురం.

సకాలంలో సహకారం అందించాలి

సకాలంలో పెట్టుబడి సహాయాన్ని అందించాలి. ఖరీఫ్ సీజన్‌లో సాగు ఊపందుకుంటుంది. ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా రైతులకు భరోసా లభించకపోవడం దారుణం. సాగు ఖర్చులు పెరుగుతున్నాయి.

- ఆంజనేయులు, రైతు, సిద్ధారెడ్డిపల్లి, చాపాడు.

సాగు ఖర్చులు భారం

వ్యవసాయం ఖర్చులు భారంగా మారుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్రప్రభుత్వం రైతుభరోసా కానీ, అన్నదాతా సుఖీభవ గానీ ఏదో ఒక పేరుతో సకాలంలో పెట్టుబడి సహాయాన్ని అందిం చాలి.

- రామసుబ్బారెడ్డి, రైతు, చల్లబసాయపల్లె, దువ్వూరు.

కుల, చేతి వృత్తులకు చేయూత

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద రిజిస్ట్రేషన్ల నిమిత్తం చేతి వృత్తి వారిలో అవగాహన పెంచాలని, కలెక్టరు శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రధానమంత్రి విశ్వ కర్మ యోజన పథకం అమలుపై సంబంధిత శాఖల అధికారులు, సభ్యులతో జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిఎం విశ్వ కర్మ యోజన పథకం కింద 18 రకాలైన చేతి వృత్తుల వారికి ఆర్థిక సహాయం అందించేందుకు ఈ కార్యక్రమాన్ని 2023 సెప్టెంబర్ 17న కేంద్ర ప్రభుత్వం ప్రారంభిం చిందన్నారు. ఈ పథకం కింద ఎంపికై ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకున్న లబ్ధిదా రులకు మొదటి విడతలో రుణ సౌకర్యం అందించడం జరుగుతుందన్నారు. ఈ పథకంను సరైన రీతిలో అర్హులందరూ సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ శిక్షణ పొందిన వారికి రూ.15 వేలు విలువగల టూల్ కిట్, స్టైఫండ్, రూ.లక్ష రుణ సౌకర్యంతో పాటు అధునాతన పనిముట్లు అందజే స్తారన్నారు. వాటిని ఎలా ఉపయోగించి తమ నైపుణ్యాన్ని మెరుగు పరచు కోవాలన్నది శిక్షణలో తెలియజేయడంతోపాటు, కేంద్ర ప్రభుత్వం జారీ చేయు ధృవ పత్రం, గుర్తింపు కార్డు అందించడం జరుగుతుందన్నారు. ఇందుకు ప్రతి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

ఎంపిడిఒ చేతివృత్తుల అసోసియేషన్లతో మాట్లాడి ఆ వృత్తుల వారిని రిజిస్టర్ అయ్యేలా అవగాహన పెంచాలన్నారు. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సూరిబాబు, డిపిఒ ధనలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పి.తేజస్విని, జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ

- డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శైలజ

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శైలజ

ప్రజాశక్తి-రాయచోటి

అవగాహనతోనే హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణ సాధ్యమని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శైలజ పేర్కొన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు పట్టణంలోని డైట్ కళాశాలలో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ సంయుక్తంగా జిల్లా స్థాయి రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శైలజ మాట్లా డుతూ యుక్త వయసుకు వచ్చిన విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాప్తి మీద అవగాహన కల్పించడం ద్వారా ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపించ వచ్చునని అన్నారు. క్విజ్ పోటీలు, మారథాన్ వంటి కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. ఎయిడ్స్, సాధారణ ఆరోగ్యం, రుతుస్రావ చక్రం, ఆరో గ్యకర ఆహారం, స్వచ్ఛంద రక్తదానం, ప్రభుత్వ ఆరోగ్య పథకాలపై క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల నుంచి 36 బృందాలు ఈ క్విజ్ పోటీలలో పాల్గొన్నాయని అన్నారు. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపల్ జ్యోతిర్మయి మాట్లాడుతూ విద్యార్థులు తమ చదువుతోపాటు ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా ఉత్తమ పౌరులుగా తయారవుతారన్నారు. మంచి అలవాట్ల ద్వారా మంచి ఆరోగ్యాన్ని సాధించవచ్చని తెలిపారు. క్విజ్ పోటీల్లో మొదటి స్థానం సాధించిన సంబేపల్లి జడ్‌పిహైస్కూల్ విద్యార్థులు రుక్సానా, రుక్సార్‌లకు రూ.5వేలు నగదుబహుమతిని, ద్వితీయ స్థానం సాధిం చిన పెద్దివీడు, రెడ్డివారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యా ర్థులు సుధారాణి, అశ్వితలకు రూ.4 వేలు నగదు బహుమతిని, తృతీయ స్థానం సాధించిన మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆయేషా, సాయిశ్రీలకు రూ.3 వేలు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. జిల్లా విజేతలుగా నిలిచిన మూడు టీమ్ విద్యార్థులు ఈనెల 18న విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనాలని క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అలీ హైదర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, ఆఫ్ కాస్ట్ జిల్లా కోఆర్డినేటర్ రవీంద్రారెడ్డి, జిల్లా రిసోర్స్ పర్సన్ అల్లావలి, ప్రాజెక్టు సిబ్బంది స్వాతి, సాదిక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం నిత్యావసరాలు

సరుకులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విజయవాడ వరద బాధితులకు అండగా నిత్యావసర సరుకులు పంపిణీ సిద్ధం చేస్తున్నారు. బుధవారం చిత్తూరు బస్టాండ్ వద్ద గల టౌన్ హాల్‌లో శరవేగంగా ప్యాకింగ్ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులను ఎమ్మెల్యే షాజ హాన్‌బాషా, సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ పర్యవేక్షించారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బుధవారం విజయవాడ వరద బాధితులకు సహాయంగా నిత్యావసర సరుకులు, కూరగాయలు, బియ్యం, వంట సామగ్రి, రగ్గులు తదితర వస్తువులు పంపిణీ చేయడానికి అవసరమైన సామగ్రిని సిద్ధం చేస్తున్నారు. ఈ పనులన్నింటిని ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ నాయకులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో బాధితులకు అండగా నిలవాల్సిన బాధ్యత సమాజంలో అందరిపై ఉందని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే విజయవాడ వరద బాధితులకు తమవంతు సాయంగా నిత్యవసర సరుకులను కూరగాయలు అవసరమైన వంట సామాగ్రిని అందించడం ద్వారా ఆదుకోవడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పి కొండయ్య నాయుడు, తహశీల్దార్ ఖాజాబీ, టిడిపి నాయకులు రాటకొండ గుర్రప్ప నాయుడు, పచ్చిపాల రామకృష్ణ ఆచారి, షంషీర్, నాగూర్ వలి, బాబా, రమణ బెస్త, నాగార్జున బాబు, బాబు నాయుడు, నవీన్ చౌదరి, దుబ్బిగాళ్ల భాస్కర్, బీదం గురునాథ్ యాదవ్, జీవి నాయుడు, విజయమ్మతో పాటు పలువురు పాల్గొన్నారు.

8 టన్నుల టమోటాలు వితరణ

అన్నమయ్య జిల్లా, మదనపల్లి టమోటా మండి యజమానులు కొందరు గొప్ప మనసును చాటుకున్నారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం బుధవారం 8 టన్నుల టమోటాలను ప్రత్యేక వాహనం ద్వారా ఎమ్మెల్యే షాజహాన్ బాషా అధ్యక్షతన పంపారు. టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.ఎ.మస్తాన్, టిడిపి బిసి సెల్ నియోజకవర్గం అధ్యక్షులు మునలికుంట నాగయ్య, టి.వి.ఎస్ బాబు, హెచ్ కేజీఎన్ ఖాజా, కేఎస్ఎం ఖాసీం మరికొంత మంది ఎమ్మెల్యే అభిమానులు 8 టన్నుల టమోటాలను బాధితుల సౌకర్యార్థం బుధవారం చేరవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ వర్షాల దాటికి సంభవించిన వరదలు కారణంగా విజయవాడ, క ృషా?నది పరివాహ ప్రాంతాలు జలమయం కావడం దురద ృష్టకరమన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో నిమగ్నం కావడం గొప్ప విషయమన్నారు. వారి స్ఫూర్తితో, ఎమ్మెల్యే సూచనలతో తమవంతు సహకారంగా 8 టన్నులు టమోటాలను అందించడం ఆనందంగా ఉందన్నారు. అదేవిధంగా వరద బాధితులకు అండగా నిలవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు.

టపాసుల లైసెన్స్‌దారులు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-రాయచోటి

2024 వ సంవత్సరమునకు దీపావళి పండుగ సందర్భంగా టపాసుల క్రొత్త తాత్కాలిక లైసెన్స్ ఫారం ఎల్ఇ-5 పొందుట కొరకు ఫారం ఎఇ-5లో ఇదివరలో ఫారం ఎల్ఇ-5 లైసెన్సులు పొందిన వారు తదుపరి రెన్యువల్ కొరకు ఫారం అర్ఇ-1లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి బుధవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. రూ.500లు చలనా చెల్లించి అక్టోబర్ 10వ లోగా మీ పరిధి లోని సబ్ కలెక్టర్, రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో దరఖాస్తు అందించాలని కోరారు. రెవెన్యూ అధికాకులు సూచించిన ప్రదేశంలో టపాకాయలు విక్రయాలు జరపాలని సూచించారు. ఇతర స్థలాల్లో విక్రయాలు జరిపే వారి లైసెన్సు దారులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉచిత ఇసుక ఉత్తిదే : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వ పాలనలో ఇసుక బంగారమైందని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానం ఉత్తదే అన్నారు. కొండ నాలుకకు మందు వేస్తే అసలు నాలుక ఊడి పోయినట్లు కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం తయారైందన్నారు. సీనరేజి ఛార్జీలు, జీఎస్టీ, లోడింగ్ ఖర్చులు, రవాణా ఛార్జీలు అన్ని కలిపి తడిసిమోపెడు అవుతున్నట్లు వివరిం చారు. గతంలో ట్రాక్టర్ ఇసుక రూ.3వేలకు దొరికేదని, ప్రస్తుతం రూ.5వేలు అవుతోందన్నారు. గతంలో లారీ ఇసుక రూ.12 వేలు ఉండగా.. ఇప్పుడు రూ.15 వేలు అయిందన్నారు. నేతి బీర కాయలో నెయ్యి ఉండదన్నట్లు ప్రభుత్వ ఉచిత ఇసుక పాలసీలో ఉచితం ఉండ దని విమర్శిం చారు. గోరుచుట్టు మీద రోకటి పోటు అన్నట్లుగా ఓ వైపు ధర పెరగడంతోపాటు మరో వైపు సామాన్య వినియోగదారులకు ఇసుక అందుబాటులో లేదని విమ ర్శించారు. ఇసుక ధర పెరగడంతో నిర్మాణ రంగం స్థంభించిపోయిందన్నారు. సిమెంట్, కడ్డీల వ్యాపా రాలు దెబ్బతిన్నట్లు తెలిపారు. పనులు లేక కూలీలు, వలస కూలీలు లబోదిబోమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం ఇసుకను వినియోగదారులకు సరస మైన ధరకు అందుబాటులో దొరికేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న డాక్టర్ ఉషాశ్రీ

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-రాయచోటి

గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టమని పిసిపి ఎన్‌డిటి నోడల్ అధికారి డాక్టర్ ఉషశ్రీ పేర్కొన్నారు. బుధవారం ఆర్‌డిఒ యు.రంగస్వామి ఆధ్వర్యంలో గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం1994 కమిటీ సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉషాశ్రీ మాట్లాడుతూ ఫార్మ్ ఎఫ్ ఆన్‌లైన్‌లో గత మూడు నెలలుగా అప్‌లోడ్ చేయని కారణంగా 13 స్కానింగ్ కేంద్రాలకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ఐదు స్కానింగ్ సెంటర్స్ యజమాన్యం నోటీస్ కు తగిన కారణాలను వివరిస్తూ జిల్లా అప్రోప్ క్రియేట్ అథారిటీకి నివేదిక ఇచ్చినట్లు చెప్పారు. ఆర్‌డిఒ యు.రంగస్వామి మాట్లాడుతూ షోకాజ్ నోటీసుకు వివరణ ఇవ్వని స్కానింగ్ కేంద్రాలకు రూ.20వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట వ్యతిరేకంగా పరీక్షలు చేస్తున్నట్టు నిర్ధారణ అయినా, ఆ స్కాన్ సెంటర్ కును మూసివేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లింగ వివక్షత ద్వారా భ్రూణ హత్యలకు పాల్పడితే స్త్రీ నిష్పత్తి తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. కమిటీ మెంబెర్స్ సురేంద్రరెడ్డి, నాగేశ్వర్ మాట్లాడుతూ స్త్రీ ప్రాముఖ్యత చట్టంపై అవగాహన కార్యక్రమాలు, డెకయ్ ఆపరేషన్ నిర్వహించడం, ఐసిడిఎస్ హెల్త్, విద్యాశాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా ప్రజలకు అవగాహన కలిపించాలని అన్నారు. కార్యక్రమంలో చిన్న పిల్లలు వైద్యులు డాక్టర్ నిస్సార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్స్ ఉషారాణి, సుగుణ, రాజగోపాల్, స్కాన్ సెంటర్స్ యాజమాన్యం పాల్గొన్నారు.

ముస్లింల ఆస్తులను అన్యాక్రాంతం చేస్తే సహించం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ముస్లింల ఆస్తులను అన్యాక్రాంతం చేస్తే సహించమని ముస్లిం, మైనార్టీ నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ సహారా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఠాణా సర్కిల్ వద్ద బిల్లును వ్యతిరేకిస్తూ క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి దాని ద్వారా జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఫిర్యాదులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ చట్టంలో ఇలాంటి సవరణలు ముస్లిం మైనార్టీలకు అవసరం లేదని పేర్కొన్నారు. ఉన్న చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. చట్ట సవరణ ద్వారా వక్ఫ్ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు కేటాయించి ముస్లింల ఆస్తులను అన్యాక్రాంతం చేయాలని బిజెపి ప్రభుత్వం చూస్తే సహించేది లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహారా వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి షేక్ అప్తాబ్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి సగీర్, మైనార్టీ నాయకులు ఫర్హాన్, సుఫియాన్, ఇమ్రాన్, జియావుల్లా, సమీవుల్లా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ముస్లిం నాయకులు

బిసిసిఐ, ఎసిఎ నిబంధనల ప్రకారం క్రికెట్ ఎంపికలు

ప్రజాశక్తి-కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఎంపికలు బిసిసిఐ, ఎసిఎ నిబంధనల ప్రకారం నిర్వహిస్తామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్ తెలిపారు. ప్రతి సంవత్సరం జిల్లా స్థాయి ఎంపికలు చేసే సమయంలో బిసిసిఐ, ఎసిఎ నిబంధనల ప్రకారం జిల్లా జట్ల ఎంపికలు చేస్తామన్నారు. ఎంపికలు బాలురు, పురుషుల విభాగంలో అండర్-14, 16, 19, 23, సీనియర్స్ విభాగాల్లో, బాలికలు, మహిళలు అండర్-15, 19, 23, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఎంపికల సమయంలో సెలక్షన్ కమిటీ ఏర్పాటు చేసి, కమిటీలో సభ్యులుగా రాష్ట్ర జట్టు క్రీడాకారులు, అసోసియేషన్ సభ్యులు ముగ్గురు ఉంటారని, వీరు ఎంపికలు నిర్వహిస్తారని తెలిపారు. ఎంపికలకు సంబంధించి వయస్సు విభాగానికి జన్మదిన ధ్రువీకరణ పత్రం, రెసిడెన్స్‌కు సంబంధించి ఆధార్ కార్డు, ఓటర్ కార్డ్, పాస్‌పోర్టులలో ఏదో ఒకటి ఉండాలని తెలిపారు. విద్యార్థులకు సంబంధించి మూడు సంవత్సరాలు స్టడీ సర్టిఫికెట్, ఎస్ఎస్‌సి మార్కుల జాబితా ఏదో ఒకటి తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను సరిచూసి, అర్హులను మాత్రమే ఎంపికల్లో పాల్గొనేలా చేసి ప్రతిభ గల క్రీడాకారులను మాత్రమే జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఎవరైనా క్రీడాకారులు తప్పుగా ధ్రువీకరణ పత్రాలను సమర్పించినట్లు ఆరోపణలు వస్తే వారిపై కమిటీ వేసి, నిజ నిర్ధారణ చేసిన తరువాత అనర్హుడని తెలిస్తే జట్టు నుంచి వెంటనే తొలగిస్తామని తెలిపారు.

ఎఎన్ఎం, జిఎన్ఎంలకు జపనీస్ భాషపై శిక్షణ

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నవిస్ హెచ్ఆర్ ఆధ్వర్యంలో ఎఎన్ఎం, జిఎన్ఎం, బిఎస్‌సి నర్సింగ్ చదివిన వారికి జపాన్ దేశంలో నర్సులుగా ఉద్యోగం కల్పించినట్లు జిల్లా అధికారి హరికృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వార రూ.25 వేలు దరఖాస్తు రుసుం కొరకు స్కాలర్షిప్ పొందే అవకాశం ఉందన్నారు. శిక్షణ అనంతరం అరు హ్లైన అభ్యర్థులకు జపాన్ దేశంలో నెలకి రూ.లక్ష నుండి రూ.1.40 లక్షల జీతంతో ఉద్యోగం పొందే అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు జపాన్ దేశంలో పని చేయడానికి సిద్ధంగా ఉండాలని, 32 సంవత్సరాలు లోపు వయసు ఉన్న అభ్యర్థుల అర్హులని, శిక్షణ కాలం 6 నెలలని, శిక్షణ బెంగళూరులో ఉంటుం దన్నారు. శిక్షణ ఫీజు రూ.3 లక్షలు, పాక్షిక శిక్షణ రుసుం రూ. 5 లక్షలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ రూ.25 వేలు చెల్లిస్తుందన్నారు. మిగిలిన రూ.25 వేలు అభ్యర్థి చెల్లించాలని మిగిలిన రూ.3 లక్షలు రుణ అవకాశం కల్పిం చనున్నారని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి జపాన్‌లో ఉద్యోగ అవకాశం కల్పించటానికి కావాల్సిన సాధుపాయాలు నైపుణ్యాభివృద్ధి సంస్థ పర్యవేక్షిస్తుందన్నారు. ఆసక్తి కలిగిన వారు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9988853335ను సంప్రదించాలన్నారు

ట్రాఫిక్ సిఐగా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె ట్రాఫిక్ సిఐగా లక్ష్మీనారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సిఐ కృష్ణమూర్తి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన సిఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్దీకరణ చేపట్టి ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూస్తానన్నారు. పెద్ద పెద్ద శబ్దాలతో ఉన్న వాహనాల సైలెన్సర్లు తొలగిస్తామన్నారు. తిరిగి శబ్దాల వచ్చే సెలెన్సర్లు అమర్చితే అలాంటి వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో వన్ వే అమలు చేస్తామన్నారు. ప్రజలు సైతం ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కెజిబివిల్లోకి ఇతరులను అనుమతించొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలోకి బయటి వ్యక్తులను అనుమతించినట్లయితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీధర్ చామకూరి కెజిబివి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ శ్రీధర్ కెజిబివి, ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ ప్రిన్సిపళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సిబ్బందికి సంబంధించిన కుటుంబ సభ్యులు కాని బయట వ్యక్తులను పాఠశాలలలోకి అనువదించరాదన్నారు. ఈ మధ్య లక్కిరెడ్డిపల్లె అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకొని అలాంటి సంఘటనలు ఎక్కడా పునరావతం కాకుండా కెజిబివి పాఠశాలల ప్రిన్సిపళ్లు జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. బాలికల వసతి గృహాలు, గురుకుల పాఠశాలలో ఎటువంటి సమస్యలు తలెత్తిన ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరిం చుకోవాలని పేర్కొన్నారు. కెజిబివి పాఠశాలలు, ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్‌లలో విద్యార్థుల అటెండెన్స్ 100 శాతం ఉండేటట్లు ప్రధాన ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఇకనుంచి అటెండెన్స్ తక్కువ ఉన్న పాఠశాలల ప్రధానో పాధ్యాయులపై తగు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతి పాఠశాలలో డ్రాప్స్ ఔట్స్ ఒకరు కూడా ఉండ కుండా చర్యలు చేపట్టాలని ప్రిన్సిపల్ లకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలని ప్రతి పాఠశాలను ఆకస్మిక

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

తనిఖీ చేయడం జరుగుతుందని విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కెజిబివి, గురుకుల పాఠశాలలలోని ఉపాధ్యాయులు, సిబ్బంది ఎవరికి కేటాయించిన విధులు వారు సక్రమంగా నిర్వహించి తమ పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాజంపేట సబ్ కలెక్టర్ నదియా దేవి, కెజిబివి పాఠశాలలు, ఆంధ్ర ప్రదేశ్ మోడల్ స్కూల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట: విభిన్న ప్రతిభావంతులకు దుస్తులు పంపిణీ చేస్తున్న భరత్‌కుమార్‌రెడ్డి

ఘనంగా ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పుల్లంపేట

రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను గుంతకల్ జోనల్ రైల్వే మాజీ మెంబర్ సల్లెం భరత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భారీగా కేక్ మరియు అన్నదానం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పల్లెం భరత్ మాట్లాడుతూ రాజంపేట ఎంపీ పుట్టినరోజు సందర్భంగా అప్పారావు సర్కిల్ కాశీనగరం నందు ఉన్న జీవనజ్యోతి ఆనందా నిలయం శాశ్విత నిత్య అన్నదాన ఆశ్రమంలో భారీ కేక్ కట్ చేసి వృద్ధులకు దివ్యాంగులకు బాల బాలికలకు దారిని వెళ్లే బాటసారులకు అనేక రకాల వంటలతో భారీ అన్నదానం మరియు దివ్యాంగులకు వృద్ధులకు నూతన వస్త్ర దానం చేసి వారి గొప్ప దయాదాతృత్వ హృదయమును చాటుకోవడం జరిగిందని తెలియజేశారు. జీవనజ్యోతి ఆనంద నిలయం శాశ్విత నిత్య అన్నదాన ఆశ్రమంలో ఆకలి తీర్చుకున్న ప్రతి ఒక్కరూ మిథున్ రెడ్డికి మరియు నాయకులు అందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ వత్తలూరు సాయి కిషోర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, జరుగు నారాయణరెడ్డి, పోలి పాపిరెడ్డి, గోపాల్ రెడ్డి, గల్లా శీను, శివారెడ్డి, పాణ్యం జయరామయ్య, దీపక్ రెడ్డి, పగిడి గిరిబాబు నాయుడు, పసుపులేటి సుబ్బరాయుడు, ఆశ్రమ చైర్మన్ పాణ్యం సుబ్రమణ్యం,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేయడంతో పాటు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అన్నమయ్య జిల్లా, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ ఎస్.ఎ. కరీముల్లా, 14వ వార్డు కౌన్సిలర్ షేక్ షబానా అజ్మీల సంయుక్త ఆధ్వర్యంలో ఎంపీ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో జిల్లా మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్ఎ.కరీముల్లా, కౌన్సిలర్ షేక్ షబానా, మాజీ రాష్ట్ర డైరెక్టర్ రవిచంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ హస్మత్‌జాన్, యర్రంరెడ్డి, రమాదేవి, తాజ్‌బాషా, సుమియా, రఫీ, వార్డు ప్రజలు పాల్గొన్నారు. **కలికిరి :** ఎంపీ మిథున్‌రెడ్డి బర్తడే వేడుకలు కలికిరి మండలంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. మాజీ మార్కెట్ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకొని ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో గుట్టపాలెం సర్పంచ్ వెంకటరెడ్డి, నాయకులు రత్నశేఖర్ రెడ్డి, వేంపల్లి ఖాదర్ బాషా, ఇస్తియాక్ అహ్మద్, మద్దిరాల మల్లికార్జున, బావాజీ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పీలేరు:** ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కోసి అందరికీ పంచిపెట్టారు. తలుపుల, పీలేరులో అన్నదాన కార్యక్రమాలు కూడా చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మల్లికార్జున రెడ్డి, వెంకటరమణ నాయుడు, మండల నూర్ బాషా దూదేకుల సంఘం అధ్యక్షులు పాలగిరిరెడ్డి అజీజ్, మస్తాన్, చక్రపాణిరెడ్డి, కేశవ రెడ్డి, చిన్న మస్తాన్ వల్లి, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి:** ఎంపీ పి.వి.మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైసిపి మండల కన్వీనర్ సదాశివరెడ్డి, జిల్లా వైసిపి ప్రధాన కార్యదర్శి కొమ్మేపల్లి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం భారీ కేక్ ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మహాదేవరెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, వైసిపి నాయకులు రామమోహన్‌రెడ్డి, నవీన్, హోటల్ రఫీ, రాజగోపాల్, గాంధీ పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల స్థాయి పాఠశాలల క్రీడలను గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంఇఒలు నారాయణ, పద్మావతిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీన నిమ్మనపల్లి జడ్పీ హైస్కూల్ (తెలుగు) పాఠశాల క్రీడా మైదానంలో పాఠశాల క్రీడల (స్కూల్ గేమ్స్)ను ఎంఇఒల ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 సంవత్సరాల లోపు విభాగాలలో బాల, బాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా, చదరంగం వంటి క్రీడాంశాలలో, 13న శుక్రవారం అథ్లెటిక్స్ మండల స్థాయిలో క్రీడలను నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మండలంలోని పాఠశాలలోని ఆసక్తి కలిగిన విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలని తెలిపారు.

రూ.1.20 లక్షలు పలికిన చిన్నంపల్లి లడ్డూ

ప్రజాశక్తి-పుల్లంపేట

లడ్డూను దక్కించుకున్న ఎర్రగుడి చంద్రశేఖర్‌రాజు

మండల పరిధిలోని చిన్నంపల్లి గ్రామంలో వినాయక చవితి ఐదవ రోజు నిమజ్జనం పురస్కరించుకొని భారీ స్థాయిలో లడ్డూ వేలం పాట పలకడం జరిగింది. లడ్డూ వేలం పాటకు ఆశవహులు ప్రయత్నాలు చేశారు. గ్రామానికి చెందిన ఎర్రగుడి చంద్రశేఖర్‌రాజు రూ.1.20 లక్షలకు కైవసం చేసుకున్నారు. మండల వ్యాప్తంగా వినాయక విగ్రహాలు బుధవారం నిమజ్జనం చేశారు. స్థానిక ఎస్ఐ మహేష్ నాయుడు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండాచూశారు.

నీలిపల్లిలో రూ.1.05 లక్షలు..

నందలూరు: మండలంలోని నందలూరు గ్రామపంచాయతీ నీలిపల్లి గ్రామంలో వెలిసిన టువంటి వినాయకస్వామి లడ్డూ వేలం పాటలో ఉప్పుశెట్టి నరసింహులు అత్యధికంగా లక్షా 5వేలకు దక్కించుకున్నారు. అనంతరం స్వామి వారి నిమజ్జనం కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉప్పు శెట్టి సుధీర్‌కుమార్, ఉప్పుశెట్టి హరికృష్ణ, ఉప్పుశెట్టి ప్రసాద్, దాసరి కాటయ్య, ఉప్పుశెట్టి కొండయ్య, ఉప్పుశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

రూ.లక్ష పలికిన అన్నమయ్య అసోసియేషన్..

లడ్డూను దక్కించుకున్న లక్ష్మీకాంత్ రెడ్డి దంపతులు

రాజంపేట అర్బన్ : అన్నమయ్య హస్టల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాలలో గణపతి లడ్డూ వేలం పాటలో రూ.లక్ష పలికింది. శ్రీలక్ష్మీసాయి లేడీస్ హాస్టల్ నిర్వాహకులు తీయగూర లక్ష్మీకాంత్‌రెడ్డి, ఆయన సతీమణి రమాదేవి దంపతులు వేలం పాటలో గణపతి లడ్డూను చేజిక్కించుకుని మేళ, తాళాలతో భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

ప్రజాశక్తి-పుల్లంపేట


ఉపాధ్యాయ దంపతులను సన్మానిస్తున్న ఎంఇఒలు

మండల పరిధిలోని అనంతంపల్లి కాంప్లెక్స్ కు సంబంధించిన టువంటి ఆర్.వరపల్లిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు శీలం ఉమామహేశ్వర్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చింది. ఈ సందర్భంగా అనంతంపల్లి కాంప్లెక్స్‌లోని ఉపాధ్యాయులు అందరూ ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎంఇఒలు వడ్డెరపోజు, ప్రేగ తిరుమలరావు, ఉమా మహేశ్వర్ విద్యారంగంలో చేసినటువంటి కృషి గురించి వివరించారు. ఈ సందర్భంగా అనంతంపల్లి కాంప్లెక్స్ చైర్మన్ జయలక్ష్మి, జాయింట్ సెక్రెటరీ సి.వి. రమణమూర్తి మాట్లాడుతూ ఉమామహేశ్వర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు అర్హుడని అన్నారు. రాబోయే కాలంలో రాష్ట్రస్థాయి అవార్డు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిఆర్‌ఎంటిలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చిట్వేలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో ఎంపిపి టంగుటూరి చంద్ర ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే పాల్గొన్నారు. సమావేశంలో మండలంలో శాఖల వారీగా ఉద్యోగుల కొరతపై సభ దృష్టికి తీసుకువచ్చారు. కొన్నేళ్లుగా విద్యా శాఖలో పెనుమార్పులు వచ్చినప్పటికీ, విద్యను బోధించే ఉపాధ్యాయులు కొరత అధికంగా ఉండడం వలన, ప్రభుత్వ పాఠశాలలో విద్య పూర్తిగా కుంటుపడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. రైతులకు అనుకూలంగా ఏర్పాటుచేసిన రైతు భరోసా కేంద్రాల్లో, వ్యవసాయ, ఉద్యాన శాఖల్లోనూ పంటల్లో వచ్చే పలు రకాల తెగుళ్లను వివరించే అధికారులు కొరత కూడా ఉందని అన్నారు. 2019లో ప్రభుత్వంలో గృహ నిర్మాణ శాఖలో బిల్లులు మధ్యంతరంగా ఆగిపోయిన వాటిపై తిరిగి సమీక్ష జరిపి వారి పూర్తిస్థాయి బిల్లు వచ్చేలా కృషి చేయాల న్నారు. విద్యుత్ శాఖ పనితీరుపై ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే శ్రీధర్ మాట్లాడుతూ మండలంలో అన్ని శాఖల సమస్యల పరిష్కా రంపై నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి రూపానందరెడ్డితో కలిసి అధికారులతో చర్చించి సమస్య పరిష్కార దిశగా చర్యలు చేపడతామని హామీనిచ్చారు. ఎంపిడిఒ శివరామిరెడ్డి సర్వసభ్య సమావేశం నిబంధనల ప్రకారం ప్రజా ప్రతి నిధులు, అధికారులు పాల్గొనాల్సి ఉండగా ఇష్టానుసారంగా ప్రజలు రావడంతో ప్రజాప్రతినిధులకే కూర్చునేందుకు కుర్చీ లేకపోవడంతో కొందరు అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపిపి సుబ్రహ్మణ్యంరెడ్డి, వైసిపి నాయకులు ఎల్.వి మోహన్‌రెడ్డి, చెవ్వు శ్రీనివాస్‌రెడ్డి, బాపూజీ, రాయిని ఆదిలక్ష్మమ్మ, సర్పంచ్‌లు రామాంజుల నాయుడు, చౌడవరం ఉమామహేశ్వర్ రెడ్డి, గుత్తి నరసింహ, చేతిపట్టు ప్రసాద్, కో-ఆప్షన్ సభ్యులు అన్సర్‌బాషా, ఎంపిటిఃసిలు నాగార్జున, గుండయ్య, కిష్టయ్య యాదవ్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

ఆ రోడ్డులో ప్రయాణం.. ప్రాణ సంకటం

ప్రజాశక్తి-పుల్లంపేట

బ్రిడ్జిపై ఉన్న గుంతలు

మండల కేంద్రంలోని కడప-చెన్నై జాతీయ రహదారి పుల్లం గేరు బ్రిడ్జిపై ప్రయాణించాలంటే వాహనదారులు, ప్రయాణీకులు బెంబే లెత్తుతున్నారు. ఆ రోడ్డులో ప్రయాణం చేయాలంటే ప్రాణ సంకటంగా భావిస్తున్నారు. ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రైల్వే కోడూరు పర్యటనలో భాగంగా రైల్వే కోడూరు నుంచి రాజంపేటకు వెళుతున్న సమ యంలోనైనా పుల్ల బ్రిడ్జిపై ఉన్న గుంతలను పూడుస్తారని ప్రజలంతా భావిం చారు. కానీ అధికారులు ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడం పట్ల వాహనదారులు ఇటు ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. ఆరోగ్యం బాలేక ఆపరేషన్ చేయించుకున్న వారు ఆ రోడ్డులో ప్రయా ణించాలంటే అక్కడే ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేద న వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో వాహన చోదకులు ప్రయాణిం చాలం టే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పుల్లంగేరు బ్రిడ్జిపై ఉన్న గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.

ఘనంగా వినాయకుడి నిమజ్జనం

తంబళ్లపల్లి : గణపతిని నిమజ్జనానికి తరలిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి తంబళ్లపల్లి

మండల కేంద్రంలోని పాత కళాశాల మైదానంలో గణేష్ యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ఐదవ రోజు బుధవారం ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులకు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. యువకులు ఆ ఉట్టి కొట్టేందుకు కోలహలంగా ఆసక్తి కనబరిచారు. అనంతరం వినూత్న తరహా క్రేన్ ద్వారా ఆ విగ్రహాన్ని పురవీధుల్లో భారీ బాణసంచా పేలుస్తూ డప్పులు వాయిస్తూ యువకులు, పిల్లలు, మహిళలు కేరిం తలు కొడుతూ కోలాహలంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అక్కమ్మ చెరువు వద్ద బావిలో నిమజ్జనం చేశారు.

గాలివీడు : మండలంలో 36 వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు ఎస్ఐరామకృష్ణ తెలిపారు. అరవీడు గ్రామంలోని కృషావతి ప్రాజెక్టులో విగ్రహాల నిమజ్జనం చేస్తున్నామని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రాజెక్టు వరకు బందోబస్తు నిర్వహించినట్లు తెలిపారు.

అలరించిన రంగవల్లులు

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ ఆర్ఎస్ రోడ్డులోని వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ టీమ్ పదవ వార్షికోత్సవం సందర్భంగా వినాయకుని విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన రంగవల్లుల పోటీలు అలరించాయి. ఈ పోటీలలో గోదా లక్ష్మీదేవి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని వెట్ గ్రెండర్‌ని, ఎంబలూరు కళ్యాణి ద్వితీయ స్థానంలో నిలిచి మిక్సీ, కలిసేట్టి వెంకటసుబ్బమ్మ తృతీయ స్థానంతో ఎలక్ట్రికల్ స్టవ్, గోదా భవిత నాలుగో స్థానంలో ప్రెజర్ కుక్కర్, మేడా పార్వతి ఐదవ స్థానంతో ఐరన్ బాక్స్ ను కైవసం చేసుకున్నారు. పోటీలలో పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులను అందించారు. న్యాయ నిర్ణయితలుగా డాక్టర్ చిన్ని సుబ్రహ్మణ్యం, పుత్తా కోటేశ్వరరావు, పుత్తా నాగేశ్వరరావు,రేనంగి నరసయ్య, బాలాజీ, రేగిమడుగు వెంకటరమణలు వ్యవహరించారు. అనంతరం పిల్లలకు కబడ్డీ, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించారు.

పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు చేరాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ బాలాజీ

పిటిఎం మండల కేంద్రంలోని జడ్‌పి హైస్కూల్(తెలుగు)ను ఎంపిడిఒ బాలాజీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసర ప్రాంతాలను వంటగది, మౌలిక వసతుల కల్పనను, పారిశుధ్య నిర్వహణను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ విద్యార్థులు విద్య పట్ల ఆసక్తితో శ్రద్ధగా చదవాలని, మంచిక్రమశిక్షణ, నడవడికతో విద్యాభ్యాసాన్ని కొనసాగించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతలో వసతి సౌకర్యాలలో ఏవైనా లోపాలు ఉంటే తమకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య నియమాలు, ఆటలు, చదువు ప్రాముఖ్యం, సమయపాలన గురించి వివరించారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి యోగానంద, ప్రధానోపాధ్యాయులు అపర్ణ, పంచాయతీ సెక్రటరీ బాషా, వెల్ఫేర్ అసిస్టెంట్ సుల్తానా పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న ఎపిడి

'ఉపాధి' పనులను వేగవంతం చేయండి : ఎపిడి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఉపాధి హామీ పథకం ద్వారా పనులను వేగవంతం చేయాలని సిబ్బందికి ఎపిడి సూచించారు.బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వారికి పలు సూచనలు, అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని, తద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. రైతులతో మాట్లాడి వారికి అవసరమైన పనులు, ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని కోరారు. సమయపాలన తప్పకుండా పాటించాలని సిబ్బందికి తెలియజేశారు. ఈ సమావేశంలో ఉపాధి పథకం ఎపిడి, ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి, ఉపాధి హామీ పథకం ఎపిఒ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 21 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళాను స్థానిక శ్రీ టిఎన్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ గవర్నమెంట్ ఐటిఐ తంబళ్లపల్లెలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపల్ ఎన్.శ్రీనివాసులు రెడ్డి, డిఒ దొనప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా పిన్సిపల్ మాట్లాడుతు జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. చదువుకొని ఉద్యోగం రాలేదని బాధపడుతున్న యువత ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై మొగ్గు చూపాలని తెలిపారు. ఉద్యోగం రాలేదని మదన పడకుండా జాబ్‌మేళాలను ప్రతిభ చూపి ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని అన్నారు. డిఇఒ మాట్లాడుతూ ఇలాంటి జాబ్ మేళాలు ప్రతి నెలా జిల్లాలోని ప్రతి ఒక్క నియోజకవర్గంలో జరుగుతాయని, ప్రతి ఒక్కరూ ఈ జాబ్ మేళాలు వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి మూడు సంస్థల ప్రతినిధులు హాజరయ్యారని చెప్పారు. మొత్తం 46 మంది అభ్యర్థులు హాజరు కాగా అం దులో 21 మంది రూ.13వేల నుంచి రూ.25వేల జీతం తో వివిధ కం పెనీలకు ఎంపిక అయ్యారని సెలెక్ట్ అయ్యారనీ వివరించారు. కార్యక్రమంలోప్లేస్మెంట్ ఆఫీసర్ వెంకటేష్, కో-ఆర్డినేటర్ చౌడయ్య పాల్గొన్నారు.

నాగ శేఖర్‌రెడ్డికి పితృ వియోగం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సుబ్బారెడ్డి (ఫైల్ ఫొటో)

ఊటుకూరు ఎంపిటిసి నాగ చంద్రశేఖర్‌రెడ్డి తండ్రి నాగా సుబ్బారెడ్డి బుధవారం మృతి చెందారు. ఇటీవల కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ బుధవారం తుది శ్వాస విడిచారు. ఊటుకూరు గ్రామపం చాయతీలో సౌమ్యుడు, మృధు స్వభావిగా మండలంలో పేరు గాంచిన సుబ్బారెడ్డి ఆకస్మిక మృతి పట్ల స్థానిక ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గురువారం మండల పరిధిలోని కొండ్లోపల్లెలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు శేఖర్‌రెడ్డి తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి

ప్రజాశక్తి - ముద్దనూరు : పత్తి పంటలో గులాబీ రంగు, రసం పీల్చు పురుగు నివారణకు తగిన చర్యలు తీసుకుని యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కడప ఆగ్రోనామి శాస్త్రవేత్త భాగవత ప్రియ సూచించారు. మండలంలోని కె.తిమ్మాపురం గ్రామంలో సాగులో ఉన్న పంటలను బుధవారం జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి నాగభూషణ్‌రెడ్డి, ఆగ్రోనామి శాస్త్రవేత్త భాగవత ప్రియ, ముద్దనూరు సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య పరిశీలించారు. అనంతరం పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త భాగవతప్రియ మాట్లాడుతూ పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి, పలు సూచనలు చేశారు. ఎఒ నాగభూషణ్ రెడ్డి మాట్లాడుతూ పత్తి పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతి నివారించుటకు పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మొదటి దశలో వేప నూనె ఒక లీటరు నీటికి 5 ఎమ్ఎల్ కలిపి పిచికారీ చేసుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. కొర్ర పంటను పరిశీలించి సాగు ఖర్చు వివరాలు, పద్ధతుల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. కొర్రలో రకాల గురించి రైతులకు వివరించారు. శనగ పంటలో ఎన్‌బిఇజి 452 రకం రైతులకు మిషన్ కోతకు మంచి అనువైన రకం అన్నారు. కార్యక్రమంలో ఎఒ వెంకటకృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, అధికారులు

సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఉపాధ్యాయులు

మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి-పుల్లంపేట

కొత్త పిఆర్‌సి అమల్లోకి వచ్చేంత వరకు ఉపాధ్యాయులకు మెరుగైన మద్యంతర భృతిని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బి.నరేంద్రనాథ్ డిమాండ్ చేశారు. టి.కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌టియు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన మధ్యంతర భృతి కమిటీని వేసి 30 శాతానికి తగ్గకుండా మధ్యంత భృతిని ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సర్తాజ్‌హుస్సేన్, వి.సిద్దయ్య, జిల్లా నాయకులు ప్రసాద్ రెడ్డి, బాల నరసింహులు, అశోక్ పాల్గొన్నారు.

15న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-రామాపురం

ఈ నెల 15న ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి ఆస్పత్రి తిరుపతి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యం శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ రాయచోటి క్యాంప్ ఆర్గనైజర్స్ లయన్ ఆంజనేయులురెడ్డి, లయన్ శ్రీనివాసులు తెలిపారు. అదే రోజు కంటి పొర, కంటిలో శుక్లాలు ఉన్నవారికి ఉచిత కంటి ఆపరేషన్‌కు ఎంపికైన వారిని తిరుపతికి తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి ఉచితంగా కంటి అద్దాలు అందిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నృత్యం చేస్తూ గుండెపోటుతో యువకుడి మృతి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని నాయిని బావిలో విషాదం చోటుచేసుకుంది. వినాయ కుని మండపం వద్ద నృత్యం చేస్తూ ఆకాష్(23) అనే యువకుడు కుప్పకూలి పోయాడు. అతని స్నేహి తులు హుటాహుటిన మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించగా మార్గ మధ్య లోనే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మండలం లోని గట్టు పంచాయితీ నాయునిబావికి చెందిన శంకర,ెండ్డెమ్మ దంపతుల పెద్ద కుమారుడు గత మూడురోజులుగా వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడి మంటపం వద్ద సహచరులతో కలిసి డ్యాన్స్ చేస్తున్నాడని తెలిపారు. రోజు మాదిరిగానే మండపం వద్ద డ్యాన్స్ వేస్తుండగా గుండెపోటు వచ్చి ఆకాష్ బోర్లపడి కన్ను మూశాడు.ప్రాణాలు ఉన్నాయని ఆశతో సహచరులు మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించగా అత్యవసర విభాగం డాక్టర్లు ఆకాశ్ అప్పటికే గుండెపోటుతో మృతి చెందాడని నిర్ధారించి తెలిపారు. ఆకాష్ మృతితోనాయిన బావిలో విషాద ఛాయలు అలముకున్నాయి.

మత్తు పదార్థాలు ఆరోగ్యానికి ప్రమాదకరం

ప్రజాశక్తి - ఖాజీపేట

యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను, ఆరోగ్యాలను నాశనం చేసుకోవద్దని ఖాజీపేట సిఐ మోహన్ పేర్కొన్నారు. బుధ వారం స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వ ర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సిఐ మోహన్, విశ్రాంత డిఎంహెచ్ఒ గుణ శేఖర్, స్టెప్ సిఇఒ గ్రేస్ నిర్మల హాజరయ్యారు. యువత మత్తు పదార్థాలకు బానిసై విచక్షణ కోల్పోతూ తప్పుడు మార్గంలో పయనిస్తూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. మత్తు పదార్థాలు సరఫరా చేసే వారు, అలాంటి వాటిని ప్రోత్సహించేవారు శిక్షార్హుల వుతారని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయ్ నరసింహ, నాగరాజు, ప్రేమకుమార్, అశోక్, పాపన రాజశేఖర్, మాల కొండయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-గాలివీడు : స్థానిక బస్టాండ్ ఆవరణంలో ఉన్న వినాయక గుడి వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కూరగాయలు సంత కావడంతో చుట్టు పక్కల17 గ్రామాల నుంచి రైతులు, ప్రజలు, వ్యాపారస్తులు బుధవారం సంతకు రావడంతో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రయాణికులకు అన్నదానంతో పాటువాటర్ బాటిళ్లను అందజేశారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, వెంకటయ్య, సూరిబాబు, గంగాధర్‌నాయుడు, కృష్ణ, మునిరెడ్డి, రాజా, ఉపేంద్ర పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-కలకడ

గాయపడిన పెద్ద నాగన్న

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు..సంబేపల్లి మండలం ఎస్ సోమవారం పంచాయతీ అగ్రహారంనకు చెందిన విశ్రాంతి ప్రధానో పాధ్యాయులు నగిరిమడుగు పెద్ద నాగన్న తన ద్విచక్ర వాహనంలో వస్తున్నట్లు తెలిపారు. అగ్రహారం నుంచి కలకడలో జరుగు సంతకు బయలుదేరినట్లు తెలిపారు. మార్గ మధ్యంలో కలకడ మండలం గుడిబండ పంచాయితీ గొల్లపల్లికి చెందిన రాసిమాను రామచంద్ర అనే వ్యక్తిని తన ద్విచక్ర వాహనంలో ఎక్కించుకొని వస్తున్నట్లు తెలిపారు.ఈ క్రమంలో కలకడ సత్యవతి నది వంతెనకు సమీపంలో కలకడవైపు వెళుతున్న నగిరిమడుగు పెదనాగన్నను, కలకడ మండలం బాలయ్య గారిపల్లి పంచాయతీ ఎర్రయ్యగారిపల్లి సుగాలి కాలనీ చెందిన బాబునాయక్ కుమారుడు మల్లికార్జున నాయక్ తన ద్విచక్ర వాహనంలో అతివేగంగా వచ్చి ఎదు రుగా వస్తున్న ద్విచక్ర ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో పెద్ద నాగన్నకు బలమైన రక్త గాయాలతో పాటు కుడి చేయి కుడి కాలు విరిగి తలకు బలమైన రక్తదాయమై చెవిలో రక్తం వస్తున్నట్లు తెలిపారు. రామచంద్రకు మోకాలు వద్ద గాయం కావడంతో స్థానిక వైద్యశాలలో చికిత్స చేయించుకున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని 108 వాహనంలో పీలేరు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించినట్లు తెలిపారు.

పది మంది పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-కలకడ

పదిమంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మండలంలోని కజరాయచెరువు పంచాయతీ చిన్న గోగులవారిపల్లె సమీపంలో ఉన్న గుర్రెడ్డి బావి దగ్గర పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో దాడి నిర్వహించారు. ఈ దాడులలో పేకాట ఆడుతున్న పదిమందిని పట్టుకుని వారి వద్ద నుండి రూ.21,440నగదును స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. ఈ దాడులలో హెడ్ కానిస్టేబుల్ కంబెల్ల రమేష్‌బాబు, పోలీసులు కరుణాకర, అల్లి, డ్రైవర్ రమేష్‌బాబు పాల్గొన్నట్లు తెలిపారు.